సాక్షి
కామారెడ్డి
బుధవారం : 28 : ఆగస్టు : 2024



**కాలనీల్లో మురికి కష్టాలు**
జీజీపేట గ్రామంలో డ్రైనేజీలు, సీసీరోడ్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- 9లో ▸



**న్యాయం చేయాలి**
యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు యూజీసీ స్కేల్ వర్తింపజేయాలని కోరుతున్నారు.
- 8లో ▸


గరిష్టం/కనిష్టం
32.4 / 21.7

**వాతావరణం**
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

# పైసలిస్తేనే పనులు!

తమ పనుల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతులు చెప్పులు అరిగేలా తిరిగినా ఫలితం ఉండటం లేదు. అదే దళారులను పట్టుకొని మామూళ్లు ముట్టచెబితే మాత్రం ఇట్టే పనులు చేసి పెడుతున్నారు. దీంతో అధికారుల తీరుతో విసిగిపోయిన పలువురు అన్నదాతలు ఆందోళనలు చేస్తున్నారు. మరికొందరు మాత్రం మనోవేదనకు గురై కార్యాలయాల్లోనే ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారు.

- రెవెన్యూ శాఖలో మారని సంస్కృతి
- కొందరు అధికారుల తీరుతో విసిగిపోతున్న రైతులు
- మొన్న నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా
- రామారెడ్డిలో ఆత్మహత్యాయత్నం చేసిన రైతు





నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: భూముల ధరలు పెరిగినట్టే వివాదాలు పెరుగుతున్నాయి. దీంతో తమ భూములు తమ పేరిట రికార్డుల్లో నమోదు చేసుకునేందుకు రైతులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ క్రమంలో కొందరు అధికారులు రైతులను రోజుల తరబడి తిప్పుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో డబ్బులు ఇచ్చినా తిప్పకోవడంతో కడుపుమండిన రైతులు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న రెండు ఘటనలు రైతుల్లో పెరిగిన అసహనం, ఆవేదనను స్పష్టం చేస్తున్నాయి. నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తమ పనుల కోసం రోజుల తరబడిగా తిరుగుతున్నారు. పనులు జరగకపోవడంతో విసుగు చెంది ఈ నెల 23న తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. విషయం పత్రికల్లో రావడంతో కలెక్టర్ సంగ్వాన్ విచారణకు ఆదేశించారు. ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ 24న తహసీల్ కార్యాలయానికి చేరుకుని విచారణ జరిపారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొరం ట్రాక్టర్ల యజమానులు కూడా తమను డబ్బుల కోసం ఇబ్బందులు పెడుతున్నారంటూ తహసీల్దార్‌పై ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. తాజాగా మంగళవారం రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయికి చెందిన ఓ రైతు తహసీల్ కార్యాలయంలోనే పురుగుల మందు తాగే యత్నం చేశాడు. భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా జరిగిన తప్పిదాలు రైతులకు అనేక ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. ప్రతీ సోమవారం ప్రజావాణిలో అత్యధిక వినతులు భూ రికార్డులకు సంబంధించినవే ఉంటున్నాయి. రికార్డులను సరి చేయడానికి ఆప్షన్లు లేక చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. కాగా కొందరు అధికారులు పనికో రేటు నిర్ణయించి దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో గతంలో జిల్లాలో పలువురు అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ఒకరిద్దరు ఏసీబీకి చిక్కారు.

### మొరం తవ్వాలంటే చేయి తడపాల్సిందే..

ఇళ్ల నిర్మాణాల్లో బేస్మెంట్ నింపేందుకు అవసరమైన మొరం సప్లయి చేసే ట్రాక్టర్లు, జేసీబీలు, టిప్పర్ల యజమానులు రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకోవాల్సిందే. లేకుంటే అనుమతులు లేవంటూ సీజ్ చేస్తున్నారు. డబ్బులు ఇస్తే ఏ అనుమతులు లేకున్నా పట్టించుకోరన్న ఆరోపణలున్నాయి. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మొరం దందా చేసేవారు నెలనెలా మామూళ్లు ఇచ్చుకుని నడుపుకుంటున్నారు. ఇక 'పెద్దోళ్ల' పేరుతో నడిచే ఇసుక దందాలో ఎవరి మామూళ్లు వారికి ముట్టాల్సిందే.

### తిరగబడే పరిస్థితి

భూ రికార్డుల విషయంలో ఇబ్బంది పెడుతున్న అధికారులపై రైతులు తిరగబడే పరిస్థితులు కనబడుతున్నాయి. నాగిరెడ్డిపేట మండలంలో పది పన్నెండు మంది రైతులు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగిన సంఘటనపై అంతటా చర్చ నడుస్తోంది. రైతుల సమస్య పరిష్కరించకుండా రోజుల తరబడి తిప్పుకోవడం, ఆఖరుకు దళారులను కలిస్తేనే పనులు జరుగుతాయన్న భావనకు వచ్చిన రైతులు అధికారుల వైఖరిని జీర్ణించుకోలేకపోతున్నారు.

### అంతటా దళారులతో దందా..

చాలా మండలాల్లో రెవెన్యూ అధికారులు దళారులను పెట్టుకుని దందా నడుపుతున్నారన్న ఆరోపణలున్నాయి. పనికో ధర నిర్ణయించి దళారుల ద్వారా డీల్ చేసుకోవడం, దళారుల ద్వారానే డబ్బులు తీసుకునే పద్ధతి కొనసాగిస్తున్నారు. నేరుగా డబ్బు తీసుకుంటే ఎవరైనా ఏసీబీని ఆశ్రయిస్తే ఇబ్బంది అవుతుందనే భయంతో మధ్యవర్తుల ద్వారానే డబ్బులు తీసుకుంటున్నారు. కొన్ని మండలాల్లో చోటా,మోటా లీడర్లు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు. మరి కొన్ని చోట్ల కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందే ధైర్యం చేసి డీల్ చేస్తున్నారు.

### పట్టా మార్పిడి చేయడం లేదని..

రామారెడ్డి: తన తండ్రి పేరు మీద ఉన్న భూమిని వారసత్వంగా తన పేరు మీదకు బదలాయింపు చేయకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ రైతు తహసీల్ కార్యాలయం ఎదుటే ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన రామారెడ్డిలో మంగళవారం కలకలం సృష్టించింది. మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన భగవాన్‌కు గ్రామంలోని 856 సర్వే నంబర్‌లో ఎకరం భూమి ఉంది. ఆ భూమిని తన తండ్రి పేరు మీద నుంచి తన మీదకు పట్టా చేయడం లేదని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగే యత్నం చేశాడు.

అక్కడే ఉన్న వారు వెంటనే అప్రమత్తమై భగవాన్‌ను అడ్డుకున్నారు. తన భూమి సర్వే నంబర్ ఆన్‌లైన్‌లో లేదని అధికారులు చెబుతున్నారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఎకరం భూమికి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు తెలిపారు. విచారణ చేసి రైతుకు న్యాయం చేస్తామన్నారు.



రామారెడ్డి తహసీల్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేస్తున్న రైతు భగవాన్

## న్యూస్‌రీల్

### ఇంటింటికీ తాగునీరు అందిస్తాం



ఎల్లారెడ్డి: అమృత్ 2.0 పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో అమృత్ 2.0 పథకం ద్వారా రూ.35 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. దీని ద్వారా మున్సిపాలిటీ పరిధిలో 45 కిలో మీటర్ల మేర అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ వేసి మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలకు ఇంటింటికీ నీటి కనెక్షన్ ఇస్తామని తెలిపారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ అభివృద్ధికి మరిన్ని నిధులను తీసుకువస్తానని అన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు సత్యనారాయణ, శ్రీకాంత్, నీలకంఠం, సాయిలు, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, నాయకులు సాయిబాబా, వినోద్‌గౌడ్, ఆరిఫ్, గయాజుద్దీన్, వెంకట్రాంరెడ్డి, గోపి, శ్రీనివాస్‌రెడ్డి, ఇంతియాజ్, గఫార్, శేకావత్ తదితరులున్నారు.

### రేపు జిల్లాస్థాయి హాకీ టోర్నమెంట్

కామారెడ్డి అర్బన్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో అండర్-17 జిల్లాస్థాయి హాకీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.లింగం, రాంరెడ్డి, ఈ మేరకు ప్రకటనలో పేర్కొన్నారు. 2008 జనవరి 1 తర్వాత పుట్టిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డ్ లేదా బర్త్ సర్టిఫికెట్, బోనాఫైడ్ చూపాలన్నారు. వివరాలకు 9494259901 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### బీసీ సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారిగా చందర్

కామారెడ్డి అర్బన్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా జెడ్పీ సీఈవో చందర్ మంగళవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. కామారెడ్డి జిల్లా ఏర్పాటు అయినప్పటి నుంచి బీసీ సంక్షేమ శాఖకు రెగ్యులర్ అధికారి ఎవరూ లేనందున గత కొన్నేళ్లుగా ఇతర శాఖల అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నెట్టుకొస్తున్నారు.

### రేపు ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడలు

కామారెడ్డి క్రైం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి జగన్నాథం మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం, కలెక్టరేట్ ఆవరణలో పోటీలు ఉంటాయన్నారు. గురువారం ఉదయం 8 గంటలకు బ్యాడ్మింటన్, 9 గంటలకు రన్నింగ్, వాకింగ్, టగ్ ఆఫ్ వార్, ఖోఖో, చెస్, టెన్నిస్ సింగిల్, డబుల్స్‌లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 28న మధ్యాహ్నం మూడు గంటలలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

### 'రుణమాఫీ'పై నేటి నుంచి సర్వే!

- కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయనున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: రుణమాఫీ విషయంలో కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం నుంచి సర్వే చేపట్టనున్నారు. అధికారులు రైతుల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా మండలాల వ్యవసాయ అధికారులు తమ పరిధిలోని గ్రామాల్లో రైతు వద్దకు వెళ్లి యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. కుటుంబ సభ్యుల నిర్ధారణకు సంబంధించి జిల్లాలో 12,056 మంది రైతుల వివరాలు యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. మూడు విడతల్లో జరిగిన రుణమాఫీలో చాలా మంది రైతుల రుణాలు మాఫీ కాలేదు. వారంతా వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వచ్చి చెక్ చేయించుకున్నారు. అయితే కుటుంబ సభ్యుల నిర్ధారణకు సంబంధించిన రైతుల వివరాలను తొలుత సేకరించి వారికి రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా ఏఈవోలు రైతుల ఇళ్లకు వెళ్లి కుటుంబ నిర్ధారణ చేసుకుని, యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. వారంలో ఈ సర్వే పూర్తి చేయాల్సి ఉంది.

### వైద్యం అందక బాలుడి మృతి



హేమంత్(ఫైల్)

బాన్సువాడ: వైద్యం అందక బాలుడు మృతి చెందిన ఘటన మంగళవారం బాన్సువాడ మాత శిశు సంరక్షణ కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్ద కొడప్‌గల్ మండలం కాటేపల్లికి చెందిన శంకర్, కృష్ణవేణి దంపతుల కుమారుడు హేమంత్(3)కు జ్వరం రావడంతో సోమవారం ఉదయం బాన్సువాడ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు బాలుడిని పరీక్షించి చికిత్స చేశారు. సాయంత్రం జ్వరం తగ్గకపోవడంతో తల్లిదండ్రులు ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరిశీలించి నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. అయితే బాలుడి తల్లిదండ్రులు మళ్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. రాత్రంతా బాలుడు ఏడవడంతో డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. బాలుడి పరిస్థితి విషమించడంతో ఉదయం మరో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు చెప్పాడు. దీంతో బాలుడి మృతదేహంతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి ఆందోళన చేశారు. రాత్రి సకాలంలో వైద్యం అందించి ఉంటే తమ కుమారుడు బతికేవాడని బాలుడి తండ్రి శంకర్ వాపోయారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు ఆస్పత్రికి వచ్చి వైద్యులను నిలదీశారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి మాట్లాడుతూ బాలుడికి వారం రోజుల నుంచి జ్వరం వస్తుందని ఆస్పత్రిలో చేర్పించారన్నారు. రోజంతా వైద్యం అందించామని చెప్పారు. బాలుడి మృతితో వైద్యుల నిర్లక్ష్యమేమి లేదన్నారు.

### కవితకు బెయిల్‌పై గులాబీ శ్రేణుల్లో హర్షం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఐదు నెలలుగా జైలులో ఉన్న కవితకు మంగళవారం బెయిల్ మంజూరైన విషయం తెలిసిన ఆమె అనుచరులు, శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు. ఫైటర్ ఈజ్ బ్యాక్ అంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా పోస్టులు పెట్టారు.

## 'అమృత్' నిధులతో పనులు చేపట్టాలి



సమావేశంలో మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: అమృత్ పథకంలో భాగంగా కామారెడ్డి మున్సిపాలిటీకి మంజూరైన రూ.90 లక్షలతో పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదేశించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మంగళవారం మున్సిపల్, ప్రజారోగ్య, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, నీటి పారుదల, ఆర్‌అండ్‌బీ అధికారులతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికీ తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. అమృత్ స్కీం నిధులతో ప్రారంభించే పనులకు అవసరమైతే సీఎంను ఆహ్వానిస్తామని చెప్పారు.

ఇంటింటికీ నీటిని అందించే లక్ష్యంతో రూ.2.50కోట్ల వ్యయంతో కొనసాగుతున్న పనులను తొందరగా పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సానిటేషన్ చేపట్టాలన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పల్లె పోరుకు సన్నాహాలు

- బీఎల్‌వోల ఇంటింటి సర్వే
- నవంబర్ 29 వరకు కొనసాగనున్న ప్రక్రియ
- ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం
- జిల్లాలో 6.80 లక్షల మంది ఓటర్లు



కామారెడ్డి క్రైం: పల్లె పోరుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీకాలం పూర్తికాగా, సుమారు నాలుగు నెలలుగా స్థానిక సంస్థలన్నింటిలోనూ ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహణ అనివార్యమైంది. ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటరు జాబితాను సవరించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. గ్రామాల్లో బూత్‌స్థాయి అధికారులు ఈ నెల 20 నుంచి ఇంటింటి సర్వేను ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి తమ వద్దనున్న ఓటరు జాబితాతో ఆన్‌లైన్‌లో బీఎల్‌వో యాప్ ప్రకారం ఆ ఇంట్లోని ఓటర్ల వివరాలను సరిచూస్తున్నారు. మార్పులు, చేర్పులు, నూతన ఓటర్ల నమోదు ఉంటే ఫామ్ - 6, 7, 8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. దరఖాస్తులకు సంబంధించి విచారణ, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారాలు చూపడం లాంటి ప్రక్రియను పూర్తి చేసి 2025 జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు అధికారులు తెలిపారు. అంతకు ముందుగానే ఎన్నికలు వస్తే, కోడ్ వచ్చే నాటికి సిద్ధంగా ఉన్న ఓటరు జాబితా ఆధారంగా ఎన్నికలకు వెళ్లనున్నారు.

### మార్పులకు అవకాశం



బీఎల్‌వోలు ఇంటింటికి తిరిగి జాబితాలోని ఓటర్ల వివరాలను సరి చూస్తారు. మార్పులు, చేర్పులు ఉంటే ఇప్పుడు సులువుగా చేసుకోవచ్చు. కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునే వారికి కూడా అవకాశం ఉంది. ఓటరు జాబితా సవరణ అన్ని విధాలుగా ఉపయోగపడుతుంది. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– మసూర్ అహ్మద్, ఏవో, కలెక్టరేట్

**జిల్లాలో మొత్తం ఓటర్ల వివరాలు..**

| నియోజకవర్గం | మొత్తం ఓటర్లు | మహిళలు | పురుషులు | ఇతరులు |
|---|---|---|---|---|
| జుక్కల్ | 2,02,887 | 1,03,354 | 99,524 | 09 |
| ఎల్లారెడ్డి | 2,23,027 | 1,16,144 | 1,06881 | 02 |
| కామారెడ్డి | 2,55,007 | 1,32,514 | 1,22,474 | 19 |

## వ్యాధులు వ్యాపించకుండా చర్యలు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: విషజ్వరాలు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్, మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న డెంగీ, మలేరియా కేసులు మరింత వ్యాప్తి చెందకుండా వైద్యారోగ్య, మున్సిపల్, పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తుగా పారిశుధ్య కార్యక్రమాలు, ఫాగింగ్, ప్రతి రోజూ డ్రైడే, యాంటీ లార్వా, క్లోరినేషన్ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ఆర్‌ఎంపీలు ప్రాథమిక వైద్య సేవలు మాత్రమే అందించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. తప్పులకు ఆస్కారం లేకుండా పంచాయతీ ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో మ్యూటేషన్, సక్సేషన్ కేసులను పూర్తి చేయడంపై దృష్టి సారించాలని ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. వీసీలో ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

### కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయాలి

కామారెడ్డి క్రైం: రుణమాఫీ కాని రైతులకు సంబంధించి కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రక్రియను వ్యవసాయ అధికారులు యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రుణమాఫీపై ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పంట రుణాలు మాఫీ రాని రైతులు 12,056 మంది ఉన్నట్లు తెలిపారు. సదరు రైతుల వివరాల నమోదును వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో పంట రుణాల రెన్యువల్ తక్కువగా నమోదు అవుతోందన్నారు. సమావేశంలో డీఏవో తిరుమల ప్రసాద్, వివిధ మండలాల ఏవోలు పాల్గొన్నారు.

### ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి అవకాశం

- 'మాటా' ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ
- కామారెడ్డి ప్రాంత విద్యార్థులకు ప్రాధాన్యం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (మాటా) ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్ కోసం 'మాటా టాస్క్' పేరుతో ఉచిత ఆన్‌లైన్ ఐటీ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఇది కామారెడ్డి ప్రాంత విద్యార్థులకు వరంలాంటిదని కామారెడ్డికి చెందిన న్యాయవాది కే శ్యాంగోపాల్‌రావు 'సాక్షి'తో పేర్కొన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మినిస్టర్ అమెరికా పర్యటన సందర్భంగా మాటా ప్రతినిధులు తాము చేపట్టబోయే కార్యక్రమం గురించి వివరించారు. అయితే తొలి విడతలో 50 మందిని ఎంపిక చేసి వారికి శిక్షణ ఇస్తామని ప్రోగ్రాం ఆర్గనైజర్‌గా వ్యవహరిస్తున్న కామారెడ్డికి చెందిన చీలపాటి నగేశ్ సీఎంకు వివరించారని తెలిపారు. కామారెడ్డి ప్రాంతం మీద ఉన్న మమకారంతో నగేశ్ తొలి విడత కామారెడ్డి వారికే ప్రాధాన్యత ఇవ్వడానికి ముందుకు రాగా సీఎం అభినందించారని పేర్కొన్నారు. మొదటి బ్యాచ్ సెప్టెంబర్ 2 నుంచి ప్రారంభమవుతుందని, దీని కోసం సెప్టెంబర్ 1 వరకు పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కంప్యూటర్ సైన్స్‌లో గ్రాడ్యుయేట్స్, అలాగే పోస్ట్ గ్రాడ్యుయేట్స్‌కు అవకాశం ఉంటుందన్నారు. 60 శాతం పైగా మార్కులు సాధించిన వారు, ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు.

- **శిక్షణ అంశాలు:** పైతాన్ ఎస్సెన్షియల్స్, మెషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ.
- **శిక్షణ సమయం :** సోమ, బుధ, గురు, శుక్ర వారాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు. పదివారాల పాటు కొనసాగనుంది.
- **రిజిస్ట్రేషన్ :** https://tinyurl.com/matatask వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

## క్లుప్తంగా

### విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



**నిజాంసాగర్(జుక్కల్) :** వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్లు విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య అన్నారు. మంగళవారం మహమ్మద్ నగర్ మండలంలోని కొమలంచ పల్లె దవాఖానాను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పల్లె దవాఖానా ఆరోగ్య కార్యకర్తలు విధులకు ఆలస్యంగా రావడంతో ఆమె మండిపడ్డారు. దవాఖానాలో ఓపీ, వైరల్ ఫీవర్ సర్వే రిజిష్టర్లు, మందులను ఆమె పరిశీలించారు. ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

### ఆకుముడత తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి



**భిక్కనూరు :** వరిపంటకు ఆకుముడత తెగులు వ్యాపించిందని దాని నివారణకు చర్యలు తీసుకోవాలని ఏవో రాధ సూచించారు. మంగళవారం భిక్కనూరు మండలంలోని కంచర్లలోని వరి పంటను ఆమె పరిశీలించారు. ఆకుముడత నివారణకు మాంకోజెబ్ 50శాతం కార్బెండజిమ్ కల్పి పిచికారి చేయాలని ఆమె రైతులకు తెలిపారు. ఏఈవో లత ఉన్నారు.

### వాలీబాల్, కబడ్డీ టోర్నీ ప్రారంభం



**బాన్సువాడ :** ఈనెల 29వ తేదీన క్రీడ దినోత్సవం పురస్కరించుకుని బాన్సువాడలో మంగళవారం వాలీబాల్, కబడ్డీ టోర్నీ నిర్వహించారు. ఈ టోర్నీని మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ ప్రారంభించారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బాన్సువాడలో మినీ స్టేడియం నిర్మించామని, క్రీడలకు పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. 16 కబడ్డీ జట్లు, 22 వాలీబాల్ జట్లు క్రీడల్లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో మినీ స్టేడియం నిర్వాహకులు నరేష్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, కృష్ణారెడ్డి, ఎంఈవోనాగేశ్వర్‌రావు తదితరులున్నారు.

### హైడ్రాను అన్ని జిల్లాల్లో అమలు చేయాలి



**కామారెడ్డి టౌన్/కామారెడ్డి క్రైం :** హైదరాబాద్‌లో అమలు చేస్తున్నట్లు హైడ్రాను అన్ని జిల్లాలో అమలు చే యాలని జాతీయ మానవ హక్కుల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఏవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్ విజయ్ భాస్కరరావు, బురిగారి నర్సింలు, కన్వీనర్ రవీందర్ రెడ్డి ఉన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



**కామారెడ్డి టౌన్ :** టీజీఎస్ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, 2013 ఆర్పీఎస్ బాండ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, 2017 వేతన సవరణ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కామారెడ్డి డిపో నాయకులు వి.డి దాస్, కృష్ణమూర్తి, బుచ్చిరెడ్డి, వెంకటిగౌడ్, లింగం, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

## కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**సదాశివనగర్:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను పెట్టుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, బీసీ బాలుర వసతి గృహం, మోడల్ స్కూల్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఇంటర్ విద్యార్థులకు ఆంగ్లం, గణితంలో పలు ప్రశ్నలు వేశారు. ఆదర్శ పాఠశాలలో వసతులపై ప్రిన్సిపాల్ రాజేందర్‌ను ఆరా తీశారు. వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ పనులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం బీసీ బాలుర వసతి గృహం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. రైతువేదికలో రైతులతో మాట్లాడారు. రుణమాఫీపై ఏవోను ప్రశ్నించారు. ఎంఈవో యోసెఫ్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ గంగసాగర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, ప్రధానోపాధ్యాయుడు దామోదర్ రెడ్డి, ఏడీఏ ప్రసన్నలక్ష్మి, ఏవో ప్రజాపతి పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్యనందించాలి



తాగునీటి వసతిని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) :** ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మండలంలోని గోలిలింగాల జీపీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీకేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పంచాయతీ కార్యాలయంలోని పలురికార్డులను ఆయన పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. నాగిరెడ్డిపేట కస్తూర్బాను తనిఖీ చేశారు. జీపీ కార్యదర్శి తిరుపతి, పాఠశాల హెచ్‌ఎం దేవయ్య తదితరులున్నారు.

### విద్యార్థుల నైపుణ్యాల పరిశీలన



**లింగంపేట(ఎల్లారెడ్డి) :** మండలంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం డీఈవో రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి నైపుణ్యాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో చెత్తా చెదారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. ఎంఈవో రామస్వామి, ఎంపీడీవో నరేష్, ప్రత్యేకాధికారి వాసంతి సిబ్బంది ఉన్నారు.

### బాలల హక్కులపై అవగాహన

**లింగంపేట(ఎల్లారెడ్డి) :** మండలంలోని మోతె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం కామారెడ్డి జిల్లా బాల రక్ష భవన్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సిబ్బంది విద్యార్థులకు బాలల హక్కుల రక్షణపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా ప్రభావం వల్ల పిల్లలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయన్నారు. హెచ్‌ఎం కృష్ణప్రసాద్, రజితారాణి, జయశ్రీ, శ్రీనివాస్, విశాల్, హసన్, విజయ్ పాల్గొన్నారు.

### సరుకుల విక్రయదారుడిపై ఫిర్యాదు



**దోమకొండ :** గ్రామంలోని అంగడిలో కిరాణా షాపు సరుకులు అమ్ముతున్నారని దీంతో తాము నష్టపోతున్నామని మంగళవారం మండలంలోని అంబారిపేటలో కిరాణవర్తక సంఘం ప్రతినిధులు జీపీ కార్యదర్శి పద్మకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉన్న కిరాణా షాపులకు గిరాకి తగ్గిందని వారన్నారు. అంగడిలో కిరాణ సరుకులు అమ్మకుండా కూరగాయల విక్రయదారులకు సూచించాలని వారు కోరారు.

### విద్యుత్ బకాయిలు చెల్లించాలి



**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) :** విద్యుత్ బిల్లుల బకాయిలను వినియోగదారులు వెంటనే చెల్లించాలని ట్రాన్స్‌కో ఏడీఈ సుదర్శన్‌రెడ్డి సూచించారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో మంగళవారం విద్యుత్ బిల్లుల బకాయిల వసూళ్ల కోసం చేపట్టిన స్పెషల్‌డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. ట్రాన్స్‌కో లైన్‌ఇన్‌స్పెక్టర్ సురేందర్, సిబ్బంది రాజయ్య తదితరులున్నారు.

### విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



**దోమకొండ :** సైబర్‌క్రైం పై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీస్ కళాబృందం సభ్యులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో కళాబృందం సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సభ్యులు ప్రభాకర్, శేషారావు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం

**కామారెడ్డి టౌన్ :** ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కామారెడ్డి మండలం నూతన కమిటీని మంగళవారం రాష్ట్ర కోశాధికారి సంగమేశ్వర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పడిగే రాజు, ప్రధాన కార్యదర్శిగా వంశీకృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా బాల్‌రాజు, కోశాధికారిగా గోపాల్, మహిళా కార్యదర్శులుగా రాణి, సంధ్యారాణిని ఎన్నుకున్నారు.

# బస్సు కోసం విద్యార్థుల సుదీర్ఘ నిరీక్షణ



బస్సు కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) :** మండలకేంద్రంలోని గోపాల్‌పేటలో మోడల్‌స్కూల్ విద్యార్థులు బస్సు కోసం ప్రతిరోజూ గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. సాయంత్రం 4.15 గంటలకు పాఠశాల సమయం ముగియడంతో మండలంలోని తండాూర్, మాటూర్, మాసాన్‌పల్లి, ఆత్మకూర్, జలాల్‌పూర్ తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు బస్సు కోసం రోడ్డుపైకి వచ్చి నిరీక్షిస్తున్నారు. కాని మంగళవారం సాయంత్రం 7గంటలకు బస్సు రావడంతో వారు విద్యార్థులు అప్పటివరకు రోడ్లపైనే పడిగాపులు కాస్తున్నారు. బస్సు వచ్చే వరకు విద్యార్థులు రోడ్డు పక్కనే కూర్చొని హోంవర్క్ చేసుకున్నారు. ఇళ్లకు వెళ్లే సరికి చీకటి పడుతోందని వారు వాపోతున్నారు.

# కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ నారాయణ గుప్తా

**భిక్కనూరు :** రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు యుజీసీ స్కేల్ వర్తింపజేయాలని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నారాయణ గుప్తా డిమాండ్ చేశారు. మంగళవారం తెయూ సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్ట్ అధ్యాపకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్స్‌లర్‌లను నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించాడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఏళ్లుగా విశ్వవిద్యాలయాల్లో అన్ని విభాగాల్లో బాధ్యతలు మోస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను పర్మినెంట్ చేసి ఆదుకోవాలన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగభద్రత కల్పించిన తర్వాతనే ప్రభుత్వం యునివర్సిటీల్లో ఉద్యోగ నియమాకప్రకటన జారీచేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, సునీత, రమాదేవి, వైశాలి, దిలీప్, శ్రీకాంత్, నీరంజన్, సరిత పాల్గొన్నారు.

## సంక్షిప్తం

**గిరిజన తండాల్లో ఉపవాసదీక్షలు**

**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) :** మండలంలోని వివిధ తండాల్లో మంగళవారం గిరిజన మహిళలు భక్తిశ్రద్ధలతో ఉపవాసదీక్షలు చేపట్టారు. శ్రావణమాసం సందర్భంగా ప్రతి మంగళవారం గిరిజన మహిళలు ఉదయం నుండి సాయంత్రం వరకు నిష్టతో ఉపవాస దీక్షలు చేపడుతున్నారు. ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహారాజ్, జగదాంబ మాతలకు సాంప్రదాయబద్ధంగా నైవేద్యాలను సమర్పించి ప్రత్యేకపూజలు చేశారు.

**వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి**

**మద్నూర్(జుక్కల్) :** ప్రభుత్వం వృద్ధుల కోసం ఏర్పాటు చేస్తున్న వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచించారు. మండలంలోని పెద్దతడ్గూర్‌లోని జీపీ కార్యాలయంలో మంగళవారం వృద్ధులకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఆయుష్, హోమియోపతి శాఖల వైద్యులు మానస, ఉమాదేవిలు వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. ప్రోగ్రాం అధికారి ఆకుల శ్రీకాంత్, ఫార్మసిస్ట్ భార్గవి,ఎస్ఎస్‌వో మహేందర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

**ఇంటింటికీ సర్వే చేయాలి**

**నస్రుల్లాబాద్(బాన్సువాడ) :** మండల కేంద్రంలోని సమీకృత భవనంలో మంగళవారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బూత్‌లెవల్ ఆఫీసర్లు ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. ఓటరు నమోదు,తొలగింపు ప్రక్రియ వేగ వంతం చేయాలన్నారు. అక్టోబర్ 18 వరకు ఓటరు తుది జాబితా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయాబ్ తహసీల్దార్ బావయ్య, గిర్దావార్ అంజు, జీపీ సిబ్బంది ఉన్నారు.

**దోమల నివారణకు చర్యలు చేపడతాం**



**కామారెడ్డి టౌన్ :** మున్సిపల్ పరిధిలో దోమల బెడద నివారణ కు ఫాగింగ్‌తో చర్యలు చేపడున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ తెలిపారు. మంగళవారం ము న్సిపల్ పరిధిలో టేక్రియాల్‌లో ఫాగింగ్‌ను పరిశీలించారు. కౌన్సిలర్ శంకర్, చంద్రశేకర్ ఉన్నారు.

**సౌత్‌క్యాంపస్‌లో పీజీ పరీక్షలు ప్రారంభం**

**భిక్కనూరు:** తెయూ సౌత్‌క్యాంపస్‌లో పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. క్యాంపస్‌లో నిర్వహించిన పరీక్షకు 173 మంది విద్యార్థులకు ఆరుగురు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ తెలిపారు.

## క్రైం కార్నర్

# వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

**కరెంట్‌షాక్‌తో రైతు ..**



మ్యాదరి సాయిరాం(ఫైల్)

**నిజాంసాగర్(జుక్కల్):** వ్యవసాయ బోరుమోటార్ స్టార్టర్‌కు కరెంట్ వైర్లను సరి చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మ్యాదరి సాయిరాం (45) అనే రైతు సోమవారం రాత్రి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. నిజాంసాగర్ మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన మ్యాదరి సాయిరాం తన వ్యవసాయ బోరు మోటార్ వద్దకు ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. భార్య సుశీల గ్రామస్తుల సహకారంతో వ్యవసాయ స్థలానికి వెళ్లి చూడగా సాయిరాం చేతిలో కరెంటు వైరు ఉండి మృతి చెంది ఉన్నాడు. విషయాన్ని గ్రామస్తులు ట్రాన్స్‌కో అధికారులకు, పోలీసులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. ఎస్సై సుధాకర్ ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

**బైక్‌పై నుంచి పడి ఒకరు..**



సర్దార్ మృతదేహం

**ఎల్లారెడ్డిరూరల్:** ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి ఒకరు మృతి చెందిన ఘటన మండల శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోమర్యాగడి తండాకు చెందిన అజ్మీరా సర్దార్(45) పనినిమిత్తం మంగళవారం బాన్సువాడ వెళ్లాడు. పని ముగించుకొని స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఎల్లారెడ్డి శివారులో బైక్‌పై నుంచి కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

**అనారోగ్యంతో వివాహిత..**



అర్చన(ఫైల్)

**తాడ్వాయి:** అనారోగ్యంతో ఓ వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని బ్రహ్మాజివాడలో చోటు చేసుకుంది. గ్రామస్తులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మాజివాడకు చెందిన పడిగె అర్చన(24), ఎర్రపహాడ్‌కు చెందిన రవితేజ ఐదు నెలల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. వీరి వాహానికి ఇరుకుటుంబాలు అంగీకరించాయి. వివాహమైన కొన్ని రోజులకు అర్చన అనారోగ్యానికి గురికావడంతో కామారెడ్డిలో వైద్యం చేయించారు. అనారోగ్యానికి గురైన నాటి నుంచి భర్త రవితేజ, అత్తామామలు చూడటానికి రాకపోవడం, ఫోన్ చేసినా మాట్లాడక పోవడంతో మనోవేదనకు గురైఆమె ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఉదయం మృతి చెందింది. అర్చన మృతిపై ఇరుకుటుంబాల్లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని సముదాయించారు. అనంతరం అంత్యక్రియలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎవరూ కేసు నమోదు చేయలేద నిఎస్సైతెలిపారు.

### ఆలయానికి వెళ్తున్న వ్యక్తిపై..

**కామారెడ్డి క్రైం:** ఆలయానికి వెళ్లి వస్తున్న ఓ వ్యక్తిని మరో నలుగురు దాడి చేసిన ఘటన విద్యానగర్ కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన విశ్వనాథం అనే వ్యాపారి అదే కాలనీలో ఉన్న శివాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా దేవునిపల్లికి చెందిన లక్ష్మీబాయి, మరో ముగ్గురు ఎదురుపడ్డారు. చాలా రోజులుగా విశ్వనాథం, లక్ష్మీబాయిల మధ్య భూతగాదాలు, ఆర్థిక లావాదేవీల గొడవలు ఉన్నాయి. మాటా మాటా పెరిగి నలుగురు కలిసి తనపై దాడి చేశారని విశ్వనాథం పేర్కొన్నారు. స్థానికులు అడ్డుకుని గాయపడిన విశ్వనాథాన్ని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

### డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

**రుద్రూర్:** మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి బోధన్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి ఒక రోజు జైలు శిక్ష విధించారని ఎస్సై సాయన్న మంగళవారం పేర్కొన్నారు. ఈ నెల 20న మండలంలోని రుద్రూర్–కోటగిరి రోడ్డుపై పోలీసులు వాహనాలు తనిఖీ చేయగా మద్యం సేవించి ఫోర్ వీలర్‌పై వస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ ఒకరోజు జైలు శిక్షను విధించినట్లు పేర్కొన్నారు. ద్విచక్ర వా హనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై కోరారు.

### యూపీఐ మోసాలకు పాల్పడిన యువకుడి అరెస్ట్

**ఖలీల్‌వాడి:** నగరంలోని పలు షాపుల్లో ఫేక్ యూపీఐ లావాదేవీలు చేసిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన షేక్ అమర్ అనే యువకుడు నగరంలోని పలు మొబైల్ దుకాణాల్లో ఫోన్‌లు కొనుగోలు చేశాడు. అనంతరం డబ్బులను ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఫేక్ యూపీఐ లావాదేవీలు జరిపాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు ఇలా రూ. 57 వేలు మోసగించినట్లు పేర్కొన్నారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### తాడ్కోల్‌లో బైక్ చోరీ

**బాన్సువాడ రూరల్:** మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన మొహ్మద్ హుస్సేన్ ఈనెల 19న తన ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్ చోరీకి గురైనట్లు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈనెల 19న బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుటుంబ సభ్యులను పరామర్శించి ఇంటికి చేరుకున్నాడు. రాత్రి ఇంటి ఎదుట బైక్ పార్క్ చేసి నిద్రించాడు. ఉదయం లేచి చూసే సరికి బైక్ చోరీకి గురైందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ పేర్కొన్నారు.

# చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై రాజు

**కామారెడ్డి క్రైం:** తాళం వేసిన ఇంట్లో జరిగిన ఓ చోరీ కేసులో హైదరా చెందిన ఓ నేరస్తుడిని దేవునిపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దేవునిపల్లి ఠాణాలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై రాజు వివరాలు వెల్లడించారు. ఈ నెల 17న పట్టణంలోని గోష్కు రాజయ్య కాలనీకి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ఇంజమూరి రాములు ఇంట్లో చోరీ జరిగింది. బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురి కావడంతో బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదైంది. నర్సన్నపల్లి శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న హైదరాబాద్‌కు చెందిన మీర్ కజామ్ అలీ ఖాన్ అలియాస్ సూర్య బాయ్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ వ్యవహారం బయటపడింది. గోష్కు రాజయ్య కాలనీలో చోరీ చేసినట్లు అంగీకరించడంతో అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అతని నుంచి రూ.1.43 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితుడిపై హైదరాబాద్ కమిషనరేట్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఇప్పటికే 102 కేసులు ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

# వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

**ప్రేమ విఫలమై ఓ యువకుడు..**

**ఖలీల్‌వాడి:** ప్రేమించిన అమ్మాయి దక్కలేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కుమార్‌గల్లీలో నివాసం ఉండే రయ్యత్ సునీల్(22) తన మేనత్త కుమార్తెను ప్రేమించాడు. సదరు యువతి సైతం యువకుడిని ప్రేమించింది. గత రెండు నెలలుగా వీరి మధ్య మనస్పర్థలు రావడంతో దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో యువతి సునీల్‌పై మూడో టౌన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ప్రేమించిన అమ్మాయి దక్కడం లేదనే మనస్థాపంతో సునీల్ కుమార్‌గల్లీలో ఉండే తన దుకాణంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

**కడుపు నొప్పి తాళలేక..**

**బాన్సువాడ రూరల్:** కడుపు నొప్పి తాళలేక ఓ వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు బాన్సువాడ సీఐ కృష్ణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దేశాయిపేట్ గ్రామానికి చెందిన కొత్మీర్‌కర్ బాలన్(66)కు కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 24న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఆచూకీ కోసం వెతుకుతుండగా మంగళవారం సోమేశ్వర్ శివారులోని ఓ వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**గన్నారంలో వృద్ధుడు..**

**ఇందల్వాయి:** అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గన్నారంలో చోటు చేసుకుంది. ఎస్సై మనోజ్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వేల్పూర్ సాయన్న(60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సాయవ్వ ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



### నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్



**కామారెడ్డి క్రైం:** దేవునిపల్లి పీఎస్ పరిధిలోని పాత కలెక్టరేట్ వద్ద పోలీసులు మంగళవా రం ప్రత్యేక తనిఖీ లు చేపట్టారు. నంబర్ ప్లేట్ లేనివి, సక్రమంగా లేని 10 వాహనాలను సీజ్ చేశారు. దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

### ముగ్గురు అరెస్ట్

**కామారెడ్డి క్రైం:** పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో చిత్తు బొత్తు ఆడుతున్న ముగ్గురిని దేవునిపల్లి పోలీసులు మంగళవారం సాయంత్రం పట్టుకున్నారు. వారి నుంచి రూ.1300, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### డంప్ చేసిన ఇసుక స్వాధీనం

**రుద్రూర్:** పొతంగల్ మండలం సుంకినిలో అక్రమంగా డంప్ చేసిన 13 ట్రాక్టర్ల ఇసుకను మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని కోటగిరి పీఎస్‌కు తరలించారు. ఇసుకను బుధవారం మధ్యాహ్నం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ మల్లయ్య పేర్కొన్నారు.

### గంజాయి పట్టివేత



**ఖలీల్‌వాడి:** నిజామాబాద్, నవీపేట్ రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. నిజామాబాద్‌లో ఇద్దరు గంజాయిని విక్రయిస్తుండగా వారి నుంచి 450 గ్రాముల ఎండు గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు, నవీపేట్‌లో ఒకరిని అదుపులోకి తీసుకోగా 250 గ్రాముల ఎండు గంజాయి, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ వెంకటేశ్, ఎస్సై నరసింహ చారి, సిబ్బంది ఉన్నారు.

# వరకట్నం వేధింపు కేసులో భర్తకు జైలు

**ఎడపల్లి:** అదనపు వరకట్నం కోసం వేధించిన కేసులో భర్తకు రెండున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ బోధన్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఈ సాయి శివ తీర్పును మంగళవారం వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాణి తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి మండలంలోని ఠానాకలాన్‌కు చెందిన లావణ్యకు నవీపేట మండలం మల్కాపూర్‌కు చెందిన ఎర్రోళ్ల రవితో 2015లో వివాహమైంది. వివాహమైన ఐదు నెలల అనంతరం అదనపు కట్నం, కల్యాణ లక్ష్మి పథకానికి సంబంధించి రూ. 50 వేలు తీసుకురావాలని భర్త, అత్తామామలు లావణ్యను వేధించారు. దీంతో ఆమె తల్లిదండ్రులు కల్యాణ లక్ష్మి పథకం డబ్బులు ఇచ్చి అత్తారింటికి పంపించారు. ఆ తర్వాత కొన్ని రోజులకు ట్రాక్టర్ కొనుగోలుకు రూ.లక్ష పుట్టింటి నుంచి తీసుకురావాలని భర్త, అత్తామామలు, ఆడపడుచు, ఆమె భర్త మానసికంగా వేధింపులకు గురి చేసి, 2016 జూన్‌లో లావణ్యను ఇంటి నుంచి వెళ్లగొట్టారు. నాటి నుంచి ఆమె తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. తర్వాత రెండు దపాలు పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినా రూ .లక్ష ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పారు. 2016 డిసెంబర్ 4న ఎడపల్లి పీఎస్‌లో లావణ్య ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణ సాగింది. భర్తకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

### పేకాట స్థావరంపై దాడి

**లింగంపేట:** మండలంలోని నల్లమడుగు అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకోగా మరో ఏడుగురు పరారైనట్లు పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ. 37730 నగదు, 7 సెల్‌ఫోన్లు, 7 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.